
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 5 ఆగస్టు 2025



ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తిలో రాష్ట్రం ముందంజ

● తూత్తుకుడి సభలో సీఎం స్టాలిన్ ● అట్టహాసంగా విన్‌ఫాస్ట్ కార్ల ఫ్యాక్టరీ ప్రారంభం



విన్‌ఫాస్ట్ కర్మాగారాన్ని ప్రారంభించి , అందులోని యంత్రాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తదితరులు

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తిలో రాష్ట్రం ముందంజలో ఉందని, దేశవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఎలక్ట్రిక్ కార్లలో 40 శాతం కార్లు రాష్ట్రంలోనే తయారవుతున్నాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఐదేళ్లలో ట్రిలియన్ డాలర్ల ఆర్థిక ప్రగతి సాధించి తీరుతామని ఆయన శపథం చేశారు. తూత్తుకుడి జిల్లా సిప్కాట్ సిలానత్తం ఇండస్ట్రియల్ పార్కులో రూ.1300 కోట్లతో నెలకొల్పిన విన్‌ఫాస్ట్ ఈవీ కర్మాగారాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన తొలి ఎలక్ట్రిక్ కారుపై ఆయన సంతకం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ విన్‌ఫాస్ట్ సంస్థ పెట్టుబడులను పెట్టేందుకు రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం తనకెంతో గర్వకారణంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న 17 నెలల్లోనే ఆ సంస్థ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. విన్‌ఫాస్ట్ సంస్థ డీఎంకే ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని, ఆ సంస్థ విస్తరణ కార్యకలాపాలకు కూడా సహాయపడతామని చెప్పారు. భారతదేశంలో తూత్తుకుడి నగరంలోనే మొదటిసారిగా పూర్తిస్థాయిలో ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి అవుతోందని ఆయన తెలిపారు. ఈ కర్మాగారంలో 80 శాతం ఉద్యోగాలను స్థానికులకు కేటాయించడం కూడా తనకు సంతోషాన్ని కలిగిస్తోందని స్టాలిన్ చెప్పారు. విన్‌ఫాస్ట్ సంస్థ వాహనాల ఉత్పత్తితోపాటు విద్య, వైద్యం, సమాచార రంగాల్లోనూ తన వంతు పెట్టుబడులను పెట్టేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు టీఆర్‌బీ రాజా, గీతా జీవన్, అనితా రాధాకృష్ణన్, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, దామో అన్బరసన్, మనో తంగరాజ్, ఎంపీ కనిమొళి, శాసనసభ్యులు మార్కండేయన్, అమృతరాజ్, షణ్ముగయ్య, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, విన్‌ఫాస్ట్ సంస్థ సీఈఓ ఫామ్‌చాన్ చవ్, సంస్థ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ప్రహ్లాదన్ త్రిపాఠీ, తదితరులు పాల్గొన్నారు.

డీజీపీ నియామకంలో నిబంధనలు అతిక్రమిస్తే

జోక్యం చేసుకుంటాం

● హెచ్చరించిన హైకోర్టు మదురై బెంచ్

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీజీపీ నియామకంలో నిబంధనలు అతిక్రమిస్తే జోక్యం చేసుకుంటామని హైకోర్టు మదురై బెంచ్ హెచ్చరించింది. డీజీపీ నియామకంపై రామనాథపురానికి చెందిన యాసర్ అరాఫత్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలు చేసిన పిటిషన్‌లో... డీజీపీ శంకర్ జివాల్ ఈ నెల 31న పదవీవిరమణ చేయనున్నారని, తదుపరి డీజీపీ పదవికి అర్హులైన అధికారుల జాబితాను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు పంపించలేదు. ప్రస్తుతం డీజీపీ పదవీకాలం పొడిగింపు, తాత్కాలిక డీజీపీ నియమించే అవకాశాలున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇలాంటి చర్యలు సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకం. రాష్ట్రంలో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఉన్నత పదవుల్లో తమకు అనుకూలమైన వారిని నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. అందువల్ల ప్రస్తుత డీజీపీ శంకర్ జివాల్ పదవీ విరమణ అనంతరం, తాత్కాలిక డీజీపీ నియామకం, శంకర్ జివాల్ పదవీ కాలం పొడిగింపు తదితరాలు చేపట్టేందుకు నిషేధం విధించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, ఏడీ మరియా క్లాట్‌తో కూడి ధర్మాసనం విచారించి... డీజీపీ నియామకానికి సంబంధించి 2006లో ప్రకాష్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు సూచించిందని, వాటిని 2019లో న్యాయమూర్తి దీపక్ మిశ్రా స్పష్టం చేశారని పేర్కొంది. డీజీపీ పదవిని సీనియర్లకే ఇవ్వాలని న్యాయమూర్తి నాగేశ్వరరావు తెలిపారు. డీజీపీ నియామకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ కూడా మార్గదర్శకాలు నిర్దేశించింది. కానీ, వాటి తమిళనాడు సహా పలు రాష్ట్రాలు పాటించడం లేదు. డీజీపీ నియామకంలో అనుసరిస్తున్న విధానాలపై ప్రభుత్వం తరఫున అఫిడవిట్ దాఖలుచేయాలన్నారు. అందులో అవినీతి జరిగినా, నిబంధనలు అతిక్రమించినా న్యాయస్థానం జోక్యం చేసుకుంటుంది. ఈ పిటిషన్‌కు సంబంధించి కేంద్ర హోంశాఖ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శి తదితరులు అఫిడవిట్ దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ ఈ నెల 11వ తేదీకి వాయిదావేశారు.

● ఓటీపీ సేకరణ వ్యవహారం

సుప్రీంకోర్టులో డీఎంకేకి చుక్కెదురు



పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డీఎంకే ఆధ్వర్యంలో 'ఏకతాటిపై తమిళనాడు' పేరుతో సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి ఓటీపీ సేకరించడాన్ని నిషేధిస్తూ మద్రాసు హైకోర్టు విధించిన స్టే తొలగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. హైకోర్టు స్టేను రద్దు చేయాలని కోరుతూ డీఎంకే సుప్రీంకోర్టులో ఇటీవల అప్పీలు పిటిషన్ దాఖలు చేసింది.. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, 'ఏకతాటిపై తమిళనాడు' నినాదంతో అధికార డీఎంకే పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టింది. ఆ ప్రకారం, ప్రజల నుంచి ఆధార్ కార్డుకు సంబంధించి ఓటీపీ అడుగుతున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ అన్నాడీఎంకే నేత రాజ్‌కుమార్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు మదురై డివిజన్ బెంచ్, సభ్యత్వ నమోదులో ఓటీపీ తీసుకోవడంపై నిషేధం విధించింది. ఈ క్రమంలో, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వును సవాలు చేస్తూ డీఎంకే తరఫున సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ సోమవారం న్యాయమూర్తి పీఎస్ నరసింహ నాయకత్వంలో సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. డీఎంకే సభత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి ఓటీపి కోరడం, కేవలం నిర్ధారించుకోవడానికేనని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్ వాదించారు. వాహన సేవలకు సంబంధించిన సంస్థలు ఈ రీతిలోనే ప్రజల నుండి ఓటీపీ అడగుతుండటం సర్వసాధారణమైన విషయమన్నారు. ఈ పరిస్థితులలో డీఎంకే సభ్యత్వ నమోదు సందర్భంగా ప్రజల నుండి ఓటీపీ తీసు కునేందుకు అనుమతించాలని కోరారు. న్యాయమూర్తులు బదులిస్తూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులో తాము జోక్యం చేసుకోలేమన్నారు. అనంతరం డీఎంకే సమర్పించిన అప్పీలు పిటిషన్ తోసిపుచ్చి, స్టే తొలగింపు కోసం మద్రాసు హైకోర్టునే ఆశ్రయించమంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది.

ప్రకటనల్లో సీఎం ఫొటోపై వివాదం

● సుప్రీంకోర్టులో ప్రభుత్వం అప్పీలు

ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటనల్లో రాజకీయ నేతలు, మాజీ ముఖ్యమంత్రుల పేర్లు, ఫొటోలో ఉపయోగించకూడదంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అప్పీలు పిటిషన్ దాఖలుచేసింది. ఈ కేసును అత్యవసరంగా విచారించాలని సుప్రీంకోర్టును కోరిన నేపథ్యంలో, కేసును బుధవారం విచారించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి పీఆర్ కవాయ్‌తో కూడిన ధర్మాసనం ప్రకటించింది. అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంలో ముఖ్యమంత్రి స్టాలిన్, దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తదితర చిత్రాలు వినియోగించారని, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు ఇది వ్యతిరేకం అన్నారు. ఈ కేసు మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంఎం శ్రీవాస్తవ, న్యాయమూర్తి సుందర్ మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ధర్మాసనం వెలువరించిన ఉత్తర్వుల్లో... 2015లో సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు, ముఖ్యమంత్రి చిత్రాన్ని ప్రకటనల్లో వినియోగించుకోవచ్చని, ఒక పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రుల చిత్రాలు ప్రభుత్వ ప్రకటనల్లో వినియోగించడం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమని, అధికార పార్టీ నేతలు, చిహ్నం, జెండా తదితరాలు ప్రభుత్వ ప్రకటనల్లో వేయడం సుప్రీంకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకమని తెలిపారు. ఆ ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపే రాజకీయ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు, పార్టీ వ్యవస్థాపకుల పేర్లు, అధికార పార్టీ జెండా, చిహ్నం తదితరాలు వినియోగించరాదని, ప్రభుత్వ పథకాల అమలుకు ఎలాంటి నిషేధం లేదని, పిటిషనర్ ఎన్నికల కమిషన్‌లో అందజేసిన ఫిర్యాదుపై చర్యలకు ఈ ఉత్తర్వులు అడ్డంగా ఉండవంటూ, తదుపరి విచారణ ఈ నెల 13వ తేదీకి వాయిదావేసింది. ఈ క్రమంలో, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ ఈ నెల 6వ తేదీ విచారించనున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పీఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం తెలిపింది.

టీవీకే మహానాడు తేదీ మార్పు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసులు అనుమతి నిరాకరించడంతో తమిళగ వెట్రి కళగవ (టీవీకే) రెండో మహానాడు తేదీ మార్పుచేయనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించాలన్న పట్టుదలతో టీవీకే పార్టీ పరంగా 120 జిల్లాల అధ్యక్షుడు, మండల నిర్వాహకులు, పంచాయతీల కార్యదర్శులు నియమించారు. ఈ నేపథ్యంలో, రెండో రాష్ట్రస్థాయి మహానాడును మదురైలో ఈ నెల 25న నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. అయితే 27వ తేదీ వినాయక చవితి కారణంగా మహానాడుకు పోలీస్ బందోబస్తు ఇవ్వడం కష్టమనే కారణంగా మదురై పోలీసులు 25వ తేదీ టీవీకే మహానాడుకు అనుమతి నిరాకరించినట్లు తెలిసింది. అందువల్ల ఈ నెల 18 నుంచి 22లోపు ఏదో ఒక తేదీలో మహానాడు జరుపుకోనున్నట్లు విజయ్ ఓ ప్రకటనలో తెలిపారు.



ఆవడిలో జరిగిన డీఎండీకే బూత్‌కమిటీ ఇన్‌ఛార్జుల సమావేశంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత తదితరులు

రైతులకు 24 గంటలూ

ఉచిత విద్యుత్

తిరునల్వేలి సభలో ఈపీఎస్ హామీ

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని తిరునల్వేలి సభలో మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల జరుగనున్న నేపథ్యంలో, రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధపడుతున్నాయి. అన్నాడీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలుపరిచిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ఎడప్పాడి పళనిస్వామి కోవై జిల్లా మేట్టుపాళయంలో గత నెల 7వ తేదీ 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' పేరిట తొలివిడత ప్రచారం ప్రారంభించారు. అక్కడినుంచి డెల్టా జిల్లాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా జూలై 7వ తేదీ వరకు పర్యటించి తన తొలివిడత ప్రచారయాత్ర పూర్తి చేశారు. ఆ తర్వాత 24 నుంచి ప్రారంభించిన రెండో విడత ప్రచారయాత్రను శివగంగ జిల్లాలో పూర్తిచేశారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆహ్వానం మేరకు విందులో పాల్గొన్న ఈపీఎస్ సోమవారం ఉదయం 10 గంటలకు తన పర్యటన ప్రారంభించారు. తిరునల్వేలి జంక్షన్‌లో ఉన్న ఓ హోటల్‌లో రైతులు, వ్యాపారులు, బీడీ కార్మికులు, నేత కార్మికులు, కుల వృత్తుల సంఘాల ప్రతినిధులతో ఈపీఎస్, నయనార్ నాగేంద్రన్ సమావేశమయ్యారు. ఈ సభలో ఈపీఎస్ మాట్లాడుతూ, అన్నాడీఎంకే విజ్ఞప్తి చేయడంవల్లే ప్రధాని నరేంద్ర మోదీ బ్యాంకుల్లో రైతులు రుణాలు పొందేందుకు సిబిల్ స్కోర్ విధానాన్ని రద్దుచేశారని, రైతుల సంక్షేమం కోసమే అన్నాడీఎంకే అధికారంలో ఉన్నా, లేకున్నా.. పనిచేస్తుందన్నారు. తాము మళ్ళీ అధికారంలోకి వచ్చాక సాగు పనులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఉదయం 11 గంటలకు తాళయూత్తు మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో అన్నాడీఎంకే ఐటీ వింగ్‌తో సమావేశమైన ఈపీఎస్ పార్టీ తరుపున ఓటర్లకు పంపించాల్సిన అంశాలు, ప్రచారం తదితర అంశాలపై సూచనలిచ్చారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు తిరునల్వేలి టౌన్ వాగైఅడి గ్రౌండులో, 6 గంటలకు పాళయంకోట మార్కెట్ జంక్షన్‌లో రోడ్‌షోలో పాల్గొన్నారు. రాత్రి 8 గంటలకు మాంగనేరి నియోజకవర్గం కళ్లకాడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. రాత్రి తెన్‌కాశి జిల్లా కుట్రాలంలో బస చేశారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కుట్రాలం నుంచి బయలుదేరనున్న ఈపీఎస్ 5 గంటలకు తెన్‌కాశిలో, సాయంత్రం 6.30 గంటలకు అంబాసముద్రం ఫ్లవర్‌బజార్‌లో, రాత్రి 8 గంటలకు ఆలంగర్‌లోని కామరాజర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలనుద్దేశించి ఈపీఎస్ మాట్లాడనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్, ఎడప్పాడి పళనిస్వామి

డీఎంకేతో చేతులు కలిపే ఉద్దేశం లేదు: ఓపీఎస్



ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా మూడు సార్లు కలిసినంత మాత్రాన తాను డీఎంకేతో పొత్తు కుదుర్చుకోనని మాజీముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం స్పష్టంచేశారు. ఇటీవల నగరంలోని సీఎం స్టాలిన్ నివాసానికి ఓపీఎస్ రెండుసార్లు వెళ్ళడం సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. అంతేకాకుండా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి నుండి ఓపీఎస్ వైదొలగడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. ఓపీఎస్ వైఖరిపై డీఎంకే మిత్రపక్షాలు, బీజేపీ కూటమి పార్టీల నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఓపీఎస్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డీఎంకే కూటమిలో తమ మద్దతుదారులతో కలిసి చేరే ప్రసక్తేలేదన్నారు. మీడియాలో తన గురించి వస్తున్న కథనాలు అవాస్తవాలన్నారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలించిన మాజీముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితల ఆశయాలకు అనుగుణంగా 2026లో అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో డీఎంకే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. తమిళ సంప్రదాయాన్ని గౌరవించేలా తాను స్టాలిన్ మర్యాదపూర్వంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నానని, ఇందులో రాజకీయం ఏదీ లేదని ఓపీఎస్ స్పష్టం చేశారు.

మృత్యువులోనూ వీడని

అన్నదమ్ముల బంధం

తిరుత్తణి వద్ద రోడ్డు ప్రమాదంలో సోదరుల దుర్మరణం



ఎ.ఎస్.హుమయూన్ (ఫైల్ ఫొటో)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం



ఎ.ఎస్.షాజహాన్ (ఫైల్ ఫొటో)

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలో సోమవారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లా పీలేరుకు చెందిన అన్నదమ్ములు మృతి చెందారు. వివరాలిలా. పీలేరుకు చెందిన మాజీ సర్పంచ్ హుమయూన్ (70) అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనను చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. ఆ మేరకు హుమయూన్, ఆయన సోదరుడు షాజహాన్ (50), బంధువు హబీబ్ (35) కారులో చెన్నై బయలుదేరారు. కారును హబీబ్ నడిపాడు. వేకువజామున తిరుత్తణి సమీపం ఆర్కాడుకుప్పం శివాలయం వద్ద కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న టిప్పర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జవగా. హుమయూన్ ఘటనా స్థలంలోనే మరణించారు. కనకమ్మ సత్రం పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని హుమయూన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు, తీవ్రంగా గాయపడిన షాజహాన్, హబీబ్‌లను చికిత్స నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక షాజహాన్ మృతి చెందారు. హబీబ్‌ను మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ రహదారిలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

తూత్తుకుడిలో 250 ఎకరాల్లో స్పేస్ పార్క్
● సీఎం స్టాలిన్ ప్రకటన
7

రేసింగ్‌లో దేశం గర్వపడేలా చేస్తా
● అజిత్ కుమార్
7

మెరీనా తీరానికి నూతన సొబగులు
● సందర్శకులకు ఆకట్టుకునే సదుపాయాలు

సమాచార దర్శిని

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, కేకే నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. మైలాపూర్ పరిధిలో వళ్లువర్‌కోట్టం సమీపంలోని సబ్ స్టేషన్ ప్రాంగణం, కేకే నగర్ పరిధిలో కేకే నగర్ సబ్ స్టేషన్ ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌లో, విద్యుత్ వినియోగదారులు పాల్గొని సమస్యలతో పాటు విద్యుత్ కోతలకు సంబంధించిన ఫిర్యాదులు చేయవచ్చని తమిళనాడు విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

టీఎన్‌పీఎస్సీ ద్వారా విద్యుత్ ఉద్యోగుల ఎంపిక

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక బోర్డు (టీఎన్‌పీఎస్సీ) ద్వారా 1,850 మంది అసిస్టెంట్ల ఎంపికకు విద్యుత్ బోర్డు ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం, 400 మంది ఏఈలు, 1,850 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపిక చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ టెక్నికల్ సర్వీస్ పరీక్ష ద్వారా ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్లు, నోటిఫికేషన్ త్వరలో వెలువరించనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

ఇండియన్ బ్యాంక్‌లో అప్రెంటీస్ శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకు ఇండియన్ బ్యాంక్‌లో ఉపకారవేతనంతో కూడిన ఏడాది వృత్తిపరమైన శిక్షణ ఇవ్వనున్నారు. ఏదైనా ఓ కోర్సులో డిగ్రీ పూర్తిచేసి 20 నుంచి 28 ఏళ్ల లోపున్న వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఎంబీసీలకు ప్రభుత్వ నిబంధన ప్రకారం వయోఃపరిమితి ఉంటుంది. ఖాళీలు మొత్తం 1,500 కాగా, ఉపకారవేతనంగా నెలకు రూ.12,000-రూ.15,000 అందించనున్నారు. ఆన్‌లైన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. దరఖాస్తు ఫీజుగా ఎస్సీ, ఎస్టీల వారు రూ.175, ఇతర విభాగాల వారు రూ.800 రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఆసక్తి కలిగిన వారు తమ అర్హత వివరాలు www.nats.education.gov.in అనే వెబ్‌సైట్‌లోను, తదుపరి www.indianbank.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 7వ తేదీలోపు పంపించాలని ప్రకటనలో తెలిపారు.

'నలంకాక్కుం స్టాలిన్' శిబిరాల ద్వారా 44,418 మందికి లబ్ధి

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ గత శనివారం ప్రారంభించిన 'నలంకాక్కుం స్టాలిన్' వైద్య శిబిరాల ద్వారా 44,418 మంది లబ్ధిపొందారు. చెన్నైలో అధికంగా 2,935 మంది, విల్లుపురంలో 2,013, తిరువళ్లూర్‌లో 1,416 మంది ఈ శిబిరాల్లో పాల్గొని వైద్య చికిత్స పొందినట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి శనివారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటలవరకు అనువైన పాఠశాలలు, కళాశాలల ప్రాంగణాలలో నిర్వహించనున్న శిబిరాలలో బ్లడ్ టెస్ట్, ఈసీజీ, ఎకో, ఎక్స్‌రే, స్కాన్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

అడవి జంతువులపై అవగాహన

● వండలూరులో తరగతులు

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అడవులు, అడవి జంతువుల గురించి తెలుసుకునేలా వండలూరు జూ పార్క్‌లో ప్రతి సోమవారం ఉచిత తరగతులు నిర్వహించనున్నారు. ఈ తరగతుల్లో అడవుల ప్రాధాన్యం, అడవి జంతువుల జీవనశైలి తదితరాలను దృశ్యరూపంలో చూపించడంతో పాటు జూ పార్క్ చుట్టూ తీసుకెళ్లి వారిని జంతువులను స్వయంగా చూపించనున్నారు. ఒకరోజుకు 50 మంది విద్యార్థులను మాత్రమే అనుమతించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు https://aazp.in/zooventure అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదుచేసుకోవచ్చని పార్క్ నిర్వాహకులు తెలిపారు.

'క్లాట్' పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు నిర్వహించే 'క్లాట్' అర్హత పరీక్షకు అక్టోబరు 31వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో దేశవ్యాప్తంగా 25 జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలున్నాయి. ఈ కళాశాలల్లో యూజీ, పీజీ లా కోర్సుల్లో ప్రవేశానికి కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) ఉత్తీర్ణత సాధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో, 2026-27 విద్యా సంవత్సర అడ్మిషన్లకు క్లాట్ పరీక్ష డిసెంబరు 7న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ సోమవారం ప్రారంభమై అక్టోబరు 31వ తేది వరకు జరుగనుంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు /ఛొటొట్టజీయు౹ూజుజూఞ్చి.జీ/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ఫీజుగా జనరల్ విభాగం వారు రూ.4,000, ఎస్సీ, ఎస్టీ విభాగాలకు చెందిన వారు రూ.3,500 చెల్లించాలని జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలో 307 రాజకీయ పార్టీలు

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్టీలు 12 ఉండగా గుర్తింపు లేకుండా, నమోదుచేసుకున్న పార్టీలు 295 ఉన్నాయి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, వాటి చిహ్నాలు, నమోదు చేసుకుని, అదే సమయంలో గుర్తింపు పొందని పార్టీల వివరాలను ప్రభుత్వ గెజిట్‌లో విడుదల చేశారు. ఆ ప్రకారం, గుర్తింపు పొందిన పార్టీలుగా డీఎంకే, కాంగ్రెస్ ఆమ్ ఆద్మీ, అన్నాడీఎంకే, బహుజన సమాజ్ పార్టీ, బీజేపీ, సీపీఐ, సీపీఎం, డీఎండీకే, నామ్ తమిళర్ కట్చి, దేశీయ మక్కల్ కట్చి, డీపీఐ తదితరాలున్నాయి. నమోదుచేసి గుర్తింపు లేనివి 295 పార్టీలుండగా, వాటిలో పీఎంకే, టీవీకే తదితరాలున్నాయి.

శిబు సోరెన్ మృతికి స్టాలిన్ సంతాపం

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): "జార్ఖండ్ ముక్తి మోర్చా స్థాపకులు, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శిబుసోరెన్ మృతికి సీఎం స్టాలిన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్‌లో, స్వాతంత్ర్యానంతర భారతదేశంలో అత్యంత ప్రభావవంతమైన గిరిజన నాయకుల్లో ఒకరైన శిబుసోరెన్ మరణవార్త చాలా బాధ కలిగించింది. దోపిడీకి వ్యతిరేకంగా ఆయన నిరంతర ప్రతిఘటన, సామాజిక న్యాయం పట్ల నిబద్ధతతో శిబుసోరెన్ జీవితం సాగింది. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమానికి కీలక రూపశిల్పుల్లో ఒకరిగా, కొత్త రాష్ట్రం కోసం గిరిజన ప్రజల దీర్ఘకాల డిమాండ్‌ను ఆయన నెరవేర్చారు. జీవితకాల పోరాట యోధుడు శిబుసోరెన్ మృతితో బాధపడుతున్న హేమంత్ సోరెన్, జార్ఖండ్ ప్రజలందరికీ నా ప్రగాఢ సానుభూతి' అంటూ సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు.

రేషన్‌షాపులో ఏనుగుల బీభత్సం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన రేషన్‌షాపు, నేలపై పడి ఉన్న బియ్యం

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు సమీపంలోని మేంగోరేంజ్ ప్రాంతంలో ఉన్న రేషన్ షాపులో ఆదివారం అర్ధరాత్రి అడవి ఏనుగులు చొరబడి బియ్యం, పప్పుదినుసులను ఆరగించి కిరాణా సరుకులన్నింటిని ధ్వంసం చేసి నానాబీభత్సం సృష్టించి వేకువజామున అక్కడి నుండి పారిపోయాయి. సోమవారం ఉదయం ఆ ప్రాంతానికి చేరుకున్న రేషన్‌షాపు సిబ్బంది, స్థానికులు రేషన్‌షాపు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని, పైకప్పు రేకులు నేలపై పడి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. రేషన్‌షాపులో ఉన్న సరుకులు ఏనుగులు ఆరగించినట్లు తెలుసుకుని విస్తుపోయారు. కందిపప్పు తదితర కిరాణా వస్తువులు కూడా నేలపై అక్కడక్కడా పడి ఉండడం గమనించారు. ఈ విషయమై స్థానికులు మాట్లాడుతూ మాంగోరేంజ్ ప్రాంతంలో గత వారం రోజులుగా అడవి ఏనుగులు సంచరిస్తున్నాయని, ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి రేషన్ షాపులో చొరబడి బియ్యాన్ని ఆరగించిన నానాబీభత్సం సృష్టించాయని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టి ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బావిలో శవం లభ్యం కేసు

విద్యార్థి కుటుంబీకులు, స్థానికుల రాస్తారోకో

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరులోని ప్రైవేటు పాఠశాల బావిలో ముకిలన్ అనే విద్యార్థి శవం లభ్యమైన కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఆ పాఠశాల నిర్వాహకులలో నలుగురిని విచారణ జరుపుతున్నారు. అదే సమయంలో ముకిలన్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అతడి కుటుంబీకులు, బంధువులు, స్థానికులు సోమవారం రాస్తారోకో జరిపారు. దీంతో ఆ పాఠశాల వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.. ముకిలన్ మృతికి కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే అతడి మృతదేహాన్ని స్వీకరిస్తామని అతడి కుటుంబీకులు స్పష్టం చేశారు. తిరుపత్తూరు - కృష్ణగిరి రహదారిలో ముకిలన్ కుటుంబీకులు, బంధువులు, స్థానికులు, బీజేపీ, టీవీకే, హిందూ మక్కల్ కట్చి స్థానిక నాయకులు కార్యకర్తలు సుమారు 500 మంది రాస్తారోకో జరిపారు. పోలీసు అధికారులు వీరితో చర్చించి ముకిలన్ పోస్టుమార్టం నివేదిక రాగానే తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ విషయమై న్యాయవాది అయిన ముకిలన్ సోదరి సత్య మాట్లాడుతూ తన తమ్ముడు మాయమైనట్లు శుక్రవారం పాఠశాల అధికారులు తెలిపారని, వెంటనే తామంతా ఆ స్కూలుకు వెళ్ళినప్పుడు సరిగా సమాధానం చెప్పలేదని, ఆ ప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీ చూపించాలని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. పోలీసులు జోక్యం చేసుకున్న మీదట సీసీ ఫుటేజీ పరిశీలించగా ముకిలన్ స్కూలు విడిచి ఎక్కడికి వెళ్లలేదని నిర్ధారణ అయ్యిందన్నారు. ఇక ముకిలన్ శవంగా లభ్యమైన బావిపై ఎల్లప్పుడూ ఇనుపకమ్మీలతో కూడిన పైకప్పు ఉంటుందని, దానికి తాళం వేసి ఉంటుందని చెబుతున్నారని, అలాంటప్పుడు ఇనుప కమ్మీల మూత ఉన్న బావిలోకి ముకిలన్ ఎలా దూకి మరణించి ఉంటాడని ఆమె ప్రశ్నించారు. దీని వల్లే ముకిలన్ మృతిపై అనుమానం కలుగుతోందని చెప్పారు. ఈ సంఘటనపై సీబీసీఐడీ విచారణ జరపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ముకిలన్ మృతి తర్వాత తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో సోమవారం పాఠశాలకు సెలవు ప్రకటించారు.



పాఠశాల వద్ద పోలీస్ బందోబస్తు. (ఇన్‌సెట్‌లో) విద్యార్థి ముకిలన్

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు ..

ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును సీబీఐకు బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు రాష్ట్రప్రభుత్వం వివరణ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది ఆమ్‌స్ట్రాంగ్‌ను పెరంబూరు ప్రాంతంలో హత్యచేసిన కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఆమ్‌స్ట్రాంగ్ భార్య పొర్కొడి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు విచారణలో జోక్యం చేసుకుంటున్నందువల్ల ఈ కేసును సీబీఐకి అప్పగించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. సోమవారం ఈ కేసు మద్రాస్ హైకోర్టులో విచారణ రాగా, హాజరైన ప్రభుత్వం తరుపు న్యాయవాది ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును రాష్ట్ర పోలీసుశాఖ పారదర్శకంగా విచారణ జరుపుతోందని, అందువల్ల సీబీఐకి బదిలీ చేయాల్సిన అవసరం లేదని వాదించారు. ఇరు తరుపు వాదనలు విన్న అనంతరం ఈ కేసుకు సంబంధించి ఈ నెల 20వ తేదీలోగా వివరణ ఇవ్వాలంటూ రాష్ట్రప్రభుత్వానికి, పోలీసుశాఖకు హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది.

విల్లుపురం కలెక్టరేట్ వద్ద దంపతుల ఆత్మాహత్యాయత్నం

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం ఓ వృద్ధుడు భార్య సహా ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించాడు. పోలీసులు సకాలంలో వారిని అడ్డుకున్నారు. ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో హరిదాస్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఆ సందర్భంగా కలెక్టరేట్‌కు వెళ్ళిన ఒట్టన్ కాడువెట్టి ప్రాంతానికి చెందిన కూలీ కార్మికుడు పెరుమాళ్ (58), ఆయన భార్య ఉన్నట్టుండి కిరోసిన్‌ను వంటిపై పోసుకుని నిప్పంటించేందుకు ప్రయత్నించారు. ఆలోగా పోలీసులు అడ్డుకుని, వారిని ప్రశ్నించగా పెరుమాళ్‌కు ప్రధాని ఆవాస్‌యోజన పథకం కింద ఇంటి స్థలం కేటాయించారని, ఆ స్థలంలో రూ.3.80లక్షల ఖర్చుపెట్టి నిర్మాణ పనులు జరుపుతున్నానని, అయితే ఈ పథకం రాష్ట్ర ప్రభుత్వం నుండి తనకు రావాల్సిన నిధులు విడుదల కాలేదన్నారు. ఆ నిధుల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆ కారణంగా తాను ఆత్మాహుతికి యత్నించినట్లు తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

కొళ్లిడం వాగులో దిగి రైతులు, రజకుల నిరసన



నీటిలో దిగి నిరసన తెలుపుతున్న మహిళలు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా కొళిడం సమీపంలోని అలగిరిపురంలో ఉన్న కొళ్లిడం వాగునీటి దిగి రైతులు, రజకులు సోమవారం ఉదయం వినూత్న నిరసన తెలిపారు. కొళ్లిడం వాగులో గత ఏడాది రాష్ట్రప్రభుత్వం రూ.7కోట్లతో నిర్మించిన చెక్ డ్యాంలో పగుళ్లు ఏర్పడి నీటిని నిల్వ చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరింజేయాలని కోరుతూ కొళ్లిడం పరిసర ప్రాంతాల్లో వందేళ్ళకు పైగా బట్టలు ఉతికే రజకులు, రైతులు ప్రభుత్వానికి విన్నవించుకున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో, జాతీయ దక్షిణ భారత నదుల అనుసంధానం రైతుల సంఘ అధ్యక్షుడు అయ్యాకన్ను అధ్యక్షతన సోమవారం కొళ్లిడం వాగులో నడుములోతు నీటిలో దిగిన రైతుల, రజకులు ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అయ్యాకన్ను మీడియాతో మాట్లాడుతూ, రూ.7 కోట్లతో కొళ్లిడం వాగులో నిర్మించిన చెక్‌డ్యాం ఏడాదిలోపే శిథిలావస్థకు చేరుకుందని, కొళ్లిడం వాగు నీటిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, వీరికి న్యాయం చేయడంలో డీఎంకే ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం ఖండించదగ్గదన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరింజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకుంటే తన నేతృత్వంలో భారీస్థాయిలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రంలో పెరుగుతున్న పరువు హత్యలు

● మద్రాస్ హైకోర్టు ఆవేదన

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతున్నాయని మద్రాస్ హైకోర్టు ఆవేదన వ్యక్తంచేసింది. కడలూరులో మృతిచెందిన కళాశాల విద్యార్థి జయసూర్య తండ్రి ఎం.మురుగన్ హైకోర్టు దాఖలు చేసిన పిటిషన్‌లో తన కుమారుడి మృతిపట్ల అనుమానం వ్యక్తం చేశారు. తన కుమారుడు ప్రమాదంలో మరణించినట్లు చిత్రీకరించారని, తాము దీనిని పరువు హత్యగా అనుమానిస్తున్నామని, అందువల్ల ఈ కేసు విచారణ మరో దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. తమ కుమారుడు ఇతర వర్గానికి చెందిన విద్యార్థినిని ప్రేమించినందువల్ల ఆమె బంధువులు తరచూ మమ్మల్ని బెదిరిస్తున్నారని, తమకు పోలీసుల భద్రత కల్పించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం హైకోర్టు ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అప్పుడు రాష్ట్రంలో పరువు హత్యలు పెరుగుతుండడంపై ఆవేదన వ్యక్తంచేసిన హైకోర్టు ధర్మాసనం ఈ పరువు హత్యలకు సంబంధించిన వాస్తవాలు వెలుగులోకి రావడం లేదని, న్యాయమూర్తి వేల్‌మురుగన్ ఆవేదన వ్యక్తంచేశారు. పిటిషనర్ కోరిక మేరకు జయసూర్య మృతి కేసు విచారణను సీబీసీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ధనుష్కోడి వద్ద రామసేతు యాత్రా సిబ్బంది రాస్తారోకో



చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ధనుష్కోడి కోదండరామాలయం వద్ద భక్తులకు రామాయణ కథలు చెబుతూ రామసేతు వంతెన రాళ్ళను పర్యాటకుల శిరస్సుపై ఉంచి డబ్బులు వసూలు చేయకూడదనే ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ రామసేతు యాత్రా సిబ్బంది సోమవారం ఉదయం ధనుష్కోడి - మదురై జాతీయ రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం ఆలయానికి దేశవిదేశాల నుంచి యాత్రికులు, పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారు. రామేశ్వరం ఆలయాన్ని దర్శించిన తర్వాత భక్తులు, పర్యాటకులు ధనుష్కోడిలో కోదండరామాలయాన్ని సందర్శిస్తారు.. ఆలయం వద్ద రామసేతుయాత్రా సిబ్బంది పేరుతో కొందరు సేవకులు పెద్ద నీటి తొట్టెల్లో రామసేతుకు ఉపయోగించన రాళ్లను వేస్తుంటారు. భక్తులు వారివద్దకు వెళ్లే నీటిలో తేలుతున్న రామసేతు రాయిని వారి తలపై ఉంచి రామాయణ శ్లోకం చెప్పి రూ.20లు, రూ.30లు ఇలా వసూలు చేస్తుంటారు. సుమారు వంద మందిదాకా ఉన్న ఈ సేవకులు ఇటీవల కాలంలో అధికారులు నిర్ణయించినట్లు రూ.20ల కంటే అధికంగా బలవంతంగా వసూలు చేస్తున్నారంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో రామనాథస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్ చెల్లదురై ఇకపై రామసేతు సిబ్బంది (సేవకులు) భక్తులు, పర్యాటకుల నుండి డబ్బులు వసూలు చేయకూడదంటూ ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఉత్తర్వును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రామసేతు సేవకులు, వారి కుటుంబ సభ్యులు కోదండరామాలయం ఎదుట బైఠాయించి రాస్తారోకో జరిపారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. ఆ ప్రకారం, తండయార్‌పేట మండలం 43వ వార్డు గుమ్మాళమ్మన్ ఆలయ వీధిలోని కమ్యూనిటీ హాలు, రాయపురం మండలం 63వ వార్డు చెల్లపిళ్లయార్ ఆలయ సమీపంలోని ఎంఎస్ మహల్, తిరువిక నగర్ మండలం 66వ వార్డు కామరాజర్ కల్యాణ మండపం, తేనాంపేట మండలం 116వ వార్డు ట్రిప్లికేన్ టీటీ ఆలయం మొదటి వీధిలోని భారతియార్ ఇల్లంలలో శిబిరాలు నిర్వహించనున్నారు. అలాగే, అలందూర్ మండలం 162వ వార్డు తిల్లైగంగా నగర్, 45వ వీధిలో ఉన్న ఆనంద కల్యాణ మండపం, అడయార్ మండలం 170వ వార్డు టీచర్స్ కాలనీ లేక్ వ్యూ రోడ్డులోని అరుళ్‌మిగు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర పెరుమాళ్ కల్యాణ మండపంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్న శిబిరాల్లో ప్రజలు పాల్గొని వినతి పత్రాలు సమర్పించవచ్చని జీసీసీ తెలిపింది.

బస్సు కిటికీ నుంచి దూకి మహిళ ఆత్మహత్య

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): షేర్ మార్కెట్లో నష్టం రావడంతో ఓ మహిళ బస్సు కిటికీ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దిండివనం సమీపంలో చోటుచేసుకుంది. తంజావూరు జిల్లా తిరునాగేశ్వరం ప్రాంతానికి చెందిన అరుణ (32) బీసీఏ పూర్తిచేసింది. ఆమె షేర్ మార్కెట్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో, నష్టాలు రావడంతో మనోవేదనలో ఉన్నట్లు సమాచారం. అరుణ, తల్లితో కలసి చెన్నైలో ఉంటున్న సోదరి రమ ఇంటికి వచ్చింది. ఆదివారం అరుణ, ఆమె తల్లి స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. కిలాంబాక్కం నుంచి ప్రైవేటు బస్సులో బయల్దేరిన అరుణ, దిండివనం సమీపం కూచ్చికొళత్తూర్ ప్రాంతంలో వస్తుండగా, డ్రైవర్ వెనుక వైపు కిటికి నుంచి కిందకు దూకింది. ఆ సమయంలో వెనుక వస్తున్న వాహనం ఆమెపై దూసుకెళ్లడంతో అరుణ అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటనపై ఒలక్కూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికపై పెంపుడు శునకం దాడి

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తండయార్‌పేటలో ఏడేళ్ల బాలికపై పెంపుడు శునకం దాడిచేయడం విషాదం నింపింది. తండయార్‌పేట నెడుంజెళియన్ నగర్‌కు చెందిన వేలు ఇంట్లో రాజా అనే ఆటో డ్రైవర్ మూడు నెలలుగా అద్దెకు ఉంటున్నాడు. రాజా విదేశీ రకానికి చెందిన 'రాట్‌వీలర్' అనే శునకాన్ని పెంచుతున్నాడు. ఆదివారం వేలు కుమార్తె స్మితికా శ్రీ దుకాణానికి వెళ్లి ఇంటికి వచ్చిన సమయంలో, అక్కడున్న రాట్‌వీలర్ శునకం ఆమె ముఖంపై దాడిచేయడంతో తీవ్రగాయాలయ్యాయి. కుమార్తె కేకలతో అక్కడి వచ్చిన వేలు, శునకాన్ని అక్కడి నుంచి తరిమి, గాయపడిన కుమార్తెను స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ బాలికను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆర్కే నగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

గూండా చట్టం కింద మాదకద్రవ్యాల విక్రేతల అరెస్ట్

వేలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరు గూండా చట్టం కింద అరెస్టయ్యారు. రాణిపేట జిల్లాలో మాదకద్రవ్యాల చెలామణి నియంత్రించేందుకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో, ఇటీవల మాదకద్రవ్యాల కేసులో అరెస్టయిన కారై ప్రాంతానికి చెందిన సుదర్శన్ (22), బోస్ అలియాస్ ఇళంగోవన్‌లపై పలు కేసులుండడంతో, ఎస్పీ అమాన్ జమాల్ సిఫారసులతో ఇద్దరిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసేందుకు అనుమతిస్తూ కలెక్టర్ చంద్రకళ ఉత్తర్వులు జారీచేశారు.

భవనాలు లేవంటూ తరగతుల బహిష్కరణ



పాఠశాల ప్రాంగణంలో బ్యాగులు, యూనిఫాం వదిలివెళ్లిన విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి: తగిన భవనాలు లేవంటూ విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసన తెలిపారు. కడలూరు జిల్లా పరంగిపేట పంచాయతి యూనియన్ మాధ్యమిక పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా భవనాలు లేకపోవడంతో, కొన్ని తరగతులు చెట్ల కిందే నిర్వహిస్తున్నారు. ఎండలు పెరిగినా, వర్షాలు కురిసినా చెట్ల కింద చదువులు ఆగిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరినా ఫలితం లేకపోయింది. దీంతో, విసుగుచెందిన విద్యార్థులు సోమవారం ఉదయం, ప్రభుత్వ అందించిన ఉచిత పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం పాఠశాల ప్రాంగణంలో వదిలి ఇళ్లకు వెళ్లిపోయారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తె మృతి

వేలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తండ్రీ, కుమార్తె మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. రాణిపేట జిల్లా ఉప్పరంతాంగళ్ స్కూలు ప్రాంతానికి చెందిన బాబు-శాంతి దంపతులకు దర్శిని (10), సుప్రియ (8), పచ్చయమ్మాళ్ (7) అనే ముగ్గురు కుమార్తెలున్నారు. ఈ క్రమంలో, బాబు తన ముగ్గురు కుమార్తెలతో ద్విచక్ర వాహనంలో పన్నియూర్ జంక్షన్ రోడ్డు ప్రాంతంలో వెళ్తుండగా, పాండియన్, అరవిందన్ వస్తున్న మరో ద్విచక్రవాహనం బాబు వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు కాగా, చుట్టుపక్కల వారు వారిని వెంటనే వాలాజా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక బాబు, మూడవ కుమార్తె పచ్చయమ్మాళ్ మృతిచెందారు. ఈ ఘటనపై కావేరి పాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రియల్టర్ హత్యకేసులో భార్య సహా నలుగురి అరెస్ట్

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువేర్కాడుకు చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ హత్యకేసులో ఆయన భార్య సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత శుక్రవారం కోలడి నది తీరంలో రియల్ ఎస్టేట్ మధ్యవర్తి శివకుమార్ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై విచారించిన పోలీసులు, అదే ప్రాంతానికి చెందిన రౌడీ లాల్, కళాశాల విద్యార్థి మోహన్‌లను అరెస్ట్ చేశారు. వారిని ప్రశ్నించగా శివకుమార్ భార్య విజయకుమార్, సురేష్ మధ్య వివాహేతర సంబంధం ఉందని, తమకు అడ్డుగా ఉన్న శివకుమార్‌ను కిరాయి ముఠా ద్వారా హతమార్చినట్లు తెలిసింది. ఈ కేసులో విజయకుమారి, సురేష్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, మరెవరి ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారణ చేపట్టారు.

160 సవర్ల నగలు, రూ.3 లక్షలు చోరీ

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పుదుకోటలోని ఓ ఇంట్లో 160 సవర్ల నగలు, నగదు చోరీచేసిన అగంతకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పుదుకోట ఫాజిల్ నగర్‌లో రైతు మురుగేశన్ కొత్త ఇల్లు నిర్మించుకుని భార్యతో కలసి ఉంటున్నాడు. ఆయన ఇద్దరు కుమారులకు వివాహమై చెన్నై, బెంగుళూరులో నివాసం ఉంటున్నారు. మురుగేశన్ ఆదివారం తన స్వగ్రామం రంగేయం వెళ్లి సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఫాజిల్ నగర్ చేరుకున్నాడు. ఆ సమయంలో, ఇంటి తలుపులు బద్దలుకొట్టి ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెంది, గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని 160 సవర్ల నగలు, రూ.3 లక్షల నగదు, 2 కిలోల వెండి చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వేలిముద్ర నిపుణులతో అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, అగంతకులు తమ ఆచూకీ కనుగొనేందుకు వీలులేకుండా ఇల్లంతా మిరప పొడి చల్లి వెళ్లారని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ బస్సు అద్దాలు ధ్వంసం: ప్రజల రాస్తోరోకో



ధ్వంసమైన బస్సు, స్థానికులతో చర్చిస్తున్న పోలీసులు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా పాపనపట్టిలో బస్సు అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్న పోలీసులను ఖండిస్తూ గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించారు. మైలం నుంచి సోమవారం ఉదయం ఓ ప్రభుత్వ బస్సు విల్లుపురం వైపు బయలుదేరింది. పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు సుమారు 60 మందికి పైగా ప్రయాణం చేసిన ఆ బస్సు ఉదయం 7.30 గంటలకు విక్రవాండి సమీపంలోని పాపనపట్టి ప్రాంతంలో ఉన్న బస్టాండులో ఆగకుండా వెళ్ళింది. దీంతో బస్సు కోసం వేచివున్న ప్రయాణికులు ఆగ్రహంతో బస్సుపై రాళ్లతో దాడి చేసినట్లు తెలిసింది. దీంతో బస్సు ముందు భాగంలో ఉన్న అద్దం పూర్తిగా ధ్వంసమైంది. దీనిపై బస్సు కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకున్న విక్రవాండి పోలీసులు దాడి చేసిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళేందుకు యత్నించగా, అక్కడున్న ప్రజలు వారితో వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అందువల్ల ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలు స్తంభించడంతో పోలీసులు ఆందోళనకారులతో చర్చించారు.

నకిలీ సర్టిఫికెట్లతో కానిస్టేబుల్ ఉద్యోగం

అడయార్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా అరక్కోణం సమీపంలోని తక్కోలంలో కేంద్ర సీఐఎస్ఎఫ్ శిక్షణా కేంద్రం ఉంది. ఇక్కడ దేశవ్యాప్తంగా ఎంపికయ్యే కానిస్టేబుళ్ళకు శిక్షణ ఇస్తుంటారు. శిక్షణ పూర్తయిన వారికి పలుచోట్ల డ్యూటీ వేస్తుంటారు. ఈ నేపథ్యంలో అసోం రాష్ట్రానికి చెందిన లక్సర్ యాదవ్ అనే వ్యక్తి గత జనవరిలో విధుల్లో చేరాడు. ఆయన సమర్పించిన సర్టిఫికెట్లను పరిశీలించగా అవి నకిలీవని తేలింది. దీంతో ఆయనపై శాఖాపరమైన చర్యలకు ఆదేశాలిచ్చిన ఉన్నతాధికారులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడవిలో పశువులతో ధర్నా సీమాన్ సహా 56 మందిపై కేసు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడినాయకనూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో అనుమతి లేకుండా పశువులను తోలుకెళ్ళి ఆదివారం ధర్నా నిర్వహించిన నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)నాయకుడు సీమాన్ సహా 56 మందిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. పశువులు అటవీ ప్రాంతాల్లో మేతమేసేందుకు అనుమతించాలని కోరుతూ సుమారు 500లకు పైగా పశువులు, స్థానిక రైతులతో కలిసి సీమాన్ అటవీశాఖ పోలీసుల అనుమతిలేకుండా ధర్నా నిర్వహించారని కేసు నమోదు చేసినట్లు తేని జిల్లా అటవీశాఖ అధికారులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

● మహిళ సహా ముగ్గురి దుర్మరణం

● ఒకరికి తీవ్రగాయాలు

తిరుత్తణి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కే పేట సమీపంలోని చిత్తూరు జాతీయ రహదారిలోని వేలన్‌కండిగై వైపు వెళ్తున్న ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే హోసూరుకు చెందిన రంగస్వామి భార్య కన్నగి ఆమె కుటుంబ సభ్యులు తిరుత్తణి సమీపంలోని నల్లాటూరులోని తమ బంధువుల ఇంటిలో జరిగిన వేడుకకు హాజరై తిరిగి స్వస్థలానికి బయలుదేరారు. చిత్తూరు జాతీయ రహదారిపై వస్తుండగా ఆ కారు అదుపుతప్పి రోడ్డుపక్కనున్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో స్టాలిన్ (46), కార్తిక్ (37) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మార్గంమధ్యలో కన్నగి (58)అనే మహిళ కూడా మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు గాయపడిన సంపత్ (45)ను ఆస్పత్రికి తరలించారు.

భళారే.. సెన్నిమలై నేతన్నల కళాసృష్టి



శాలువపై శివకార్తికేయన్, సాయిపల్లవి, మేజర్ ముకుంద్ ఉన్నికృష్ణన్ ఫొటోలతో సెన్నిమలై శాలువ చూపుతున్న కళాకారులు

ఈరోడ్ జిల్లా సెన్నిమలై హస్త కళలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతానికి చెందిన నేత కార్మికులు తమలోని ప్రతిభా కళా నైపుణ్యాన్ని వస్త్ర డిజైన్లపై చూపుతుంటారు. తాజాగా 'అమరన్' చిత్రంలో హీరోహీరోయిన్లుగా నటించిన శివకార్తికేయన్, సాయిపల్లవి చిత్రాలతో పాటు వీరమరణం పొందిన మేజర్ ముకుంద్ ఉన్నికృష్ణన్ ఫ్యామిలీ ఫొటోలను డిజైన్ చేశారు. ఒకే శాలువలో వీరందరి ఫొటోలను తమ హస్తకళ ద్వారా అద్భుతంగా పొందుపరిచారు. ఈ శాలువను సెన్నిమలై యూనియన్ శివకార్తికేయన్ సంక్షేమ సంఘం, నేత కార్మికుల సంఘం నేతలు కలిసి హీరో శివకార్తికేయన్‌ను కలిసి అందజేశారు. గతంలో ఈ నేత కార్మికులు మహాత్మా గాంధీ, క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ సహా అనేక మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను శాలువపై డిజైన్ చేసి, ప్రతి ఒక్కరినీ అబ్బురపరిచిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

చిత్రజ్యోతి

'జూటోపియా-2'లో ఓ దృశ్యం



అడ్వెంచర్ మూవీగా 'జూటోపియా-2'

వాల్ట్ డిస్నీ యానిమేషన్ స్టూడియోస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం 'జూటోపియా-2'. తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోంది. వచ్చే నవంబరు 28న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలకానుంది. ఈ చిత్రం నుంచి ట్రైలర్‌తో పాటు పోస్టర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. 2016లో వచ్చిన మొదటి భాగం ప్రపంచ వ్యాప్తంగా సూపర్‌హిట్ కావడంతో రెండో భాగంపై అంచనాలు పెరిగిపోయాయి. ఈ సీక్వెల్‌లో కొత్త పాత్రలుగా గ్యారీ డిస్నేక్, నిబుల్స్, డాక్టర్ ఫజ్‌బై పరిచయమవుతున్నారు. ఆస్కార్ విజేతలైన జూరెడ్ బుష్, బైరన్ హోవార్డ్ దర్శకత్వం వహించారు. యవెట్ మెరినో నిర్మాణంలో వాల్ట్ డిస్నీ యానిమేషన్ స్టూడియోస్ రూపొందించిన 64వ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్‌గా నిలువనుంది. హ్యూమర్, ఎమోషన్, మిస్టరీతో కూడిన ఈ అడ్వెంచర్‌ను అభిమానులు థియేటర్లలో చూసేందుకు అమితాసక్తితో ఎదురుచూస్తున్నారు.

గ్రిప్పింగ్ పోలీస్ డ్రామాగా 'పోలీస్ పోలీస్'



'పోలీస్ పోలీస్'లో ఓ దృశ్యం

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం హాట్‌స్టార్ కొత్తగా నిర్మిస్తున్న వెబ్‌సిరీస్ 'పోలీస్ పోలీస్'. మురట్టు రాజావుమ్ - తిరుట్టు మురలియుం అనే ట్యాగ్‌లైన్ జోడించింది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుపుకుంటున్న నేపథ్యంలో తాజాగా ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'హర్ట్ బీట్', 'ఆఫీస్', 'ఉప్పు పులి కారమ్' వంటి సిరీస్‌లను నిర్మించిన హాట్‌స్టార్.. ఇపుడు గ్రిప్పింగ్ పోలీస్ స్టోరీతో 'పోలీస్ పోలీస్' ఈ వెబ్ సిరీస్ రూపొందించింది. ఇందులో ప్రధాన పాత్రను ఆర్జే సెంథిల్ పోషించగా, రెండో కథానాయకుడిగా తొలిసారి పరిచయమవుతున్న జయశీలన్ నటిస్తున్నారు. ఇతర పాత్రల్లో షబానా షాజహాన్, సుజితా ధనుష్, సత్య, విన్సెంట్ రాయ్‌తో సహా అనేక మంది నటీనటులు నటించారు. పోలీస్ ఆఫీసర్ ఇన్విస్టిగేషన్, భావోద్వేగ సంఘర్షణలతో ఒక గ్రిప్పింగ్ పోలీస్ డ్రామాగా రూపొందిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించి ప్రోమో, టీజర్ రిలీజ్‌లను త్వరలోనే విడుదల చేయనున్నారు. ఈ వెబ్ సిరీస్ సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

నేనొక పడి లేచిన కెరటాన్ని

అజిత్ కుమార్ ● రేసింగ్‌లో దేశం గర్వపడేలా చేస్తా



తాను పడిలేచిన కెరటంలా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నానని, కార్ రేసింగ్‌లో మన దేశం గర్వపడేలా చేస్తానని అగ్ర నటుడు అజిత్ కుమార్ పేర్కొన్నారు. ఆయన చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి 33 యేళ్ళు పూర్తి చేసుకున్న శుభసందర్భంలో ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు. 'జీవితంలో ఎన్నో మానసిక ఒత్తిడిలు, ఎదురు దెబ్బలు, వైఫల్యాలు నిరంతరం పరీక్షించాయి. వాటన్నింటినీ ఎదుర్కొంటూనే ముందుకు సాగాను. అన్నింటినీ భరించి పడిలేచిన కెరటంలా మరింత ఉత్సాహంతో ముందుకు వెళుతున్నాను. సినిమాల్లో వరుస పరాజయాలు ఎదురై... ఇక విజయం ఊహించలేనని అనుకున్న ప్రతిసారి అభిమానుల ప్రేమే నన్ను ప్రోత్సహించింది. మోటార్ రేసింగ్‌లో శారీరకంగా దెబ్బలు తగిలాయి. అక్కడ కూడా నన్ను ఎదగనీయకుండా ఆపేందుకు ఎందరో ప్రయత్నించారు. అవమానించారు. పరీక్షలు పెట్టారు. కానీ, పతకాలు సాధించే స్థాయికి చేరుకున్నాను. దీనింతటికీ మీ ప్రేమాభిమానాలే కారణం. నా భార్య షాలిని లేకుంటే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. ఆమె ఎపుడూ నా వెంటే నిలిచివుంది. ఇక అభిమానుల ప్రేమ మాటల్లో వర్ణించలేనిది. మీ ప్రేమను ప్రతి క్షణం ఆస్వాదిస్తూనే ఉంటాను. 33 యేళ్ళుగా మీరు నన్ను, నాలోని లోపాలను అన్నింటినీ అంగీకరించారు. మీతో ఎప్పటికీ నిజాయితీగా ఉండటానికి ప్రయత్నిస్తాను. మోటార్ రేసింగ్‌లోనూ మనదేశం గర్వపడేలా చేస్తానని మాట ఇస్తున్నాను' అని అజిత్ కుమార్ పేర్కొన్నారు.



తూత్తుకుడిలో పెట్టుబడిదారుల సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

తూత్తుకుడిలో 250 ఎకరాల్లో స్పేస్ పార్క్

● సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలో 250 ఎకరాల్లో స్పేస్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. తూత్తుకుడిలో సోమవారం మధ్యాహ్నం జరిగిన పెట్టుబడిదారుల సదస్సును ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా రూ.1230కోట్లతో 3100మందికి ఉపాధి కల్పించేలా నాలుగుప్రాజెక్టుల వాణిజ్య ఉత్పత్తులనుకూడా ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తూత్తుకుడి, తిరునల్వేలిలో మునగకాయల ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తిరునల్వేలిలో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ నెలకొల్పుతామని, తూత్తుకుడిలో వాణిజ్య నౌకాయానం అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని, మౌలిక సదుపాయాలను పెంచుతామని సీఎం పేర్కొన్నారు.. ముత్యాలనగరం తూత్తుకుడిలో రెండోసారి పెట్టుబడిదారుల సదస్సు ఏర్పాటు చేయడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. తాగునీటి అవసరాలను తీర్చేందుకు సముద్రపు నీటిని మంచినీరుగా మార్చే నిర్లవణీకరణ కర్మాగారాన్ని తూత్తుకుడిలో ఏర్పాటు చేస్తున్నామని,మదురై జిల్లాలో టైడల్‌పార్కు, తూత్తుకుడిలో నియో టైడల్ పార్కు, తిరునల్వేలి జిల్లాలో టాటాఇంధన,విక్రమ్ సోలార్‌ఇంధన ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని చెప్పారు.ఈసదస్సులో పరిశ్రమలశాఖ మంత్రి టీఆర్బీ రాజా తదితర మంత్రులు, డీఎంకే ఎంపీ కనిమొళి తదితరులు పాల్గొన్నారు.

పురుషులు మాత్రమే పాల్గొనే జాతర

● రాశిపురంలో మాంసాహార విందు



విందులో పాల్గొన్న పురుషులు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా రాశిపురం సమీపంలో మళయాంపట్టి గ్రామ దేవత ఆలయంలో నిర్వహించిన జాతరలో పురుషులు మాత్రమే పాల్గొన్నారు. జాతరలో మొక్కుతీర్చుకుంటూ అమ్మవారికి కానుకగా సమర్పించి 230 మేకలను బలిచ్చి ఆ మాంసంతో ఆదివారం అర్ధరాత్రి ఏర్పాటు చేసిన విందు సోమవారం తెల్లవారుజామున 5 గంటల వరకు సాగింది. మళయాంపట్టి గ్రామంలో పొంగలాయి అమ్మవారికి ప్రతి ఏటా ఆడి మాసంలో నిర్వహించే జాతరలో చుట్టుపక్కల గ్రామాల పురుషులు మాత్రమే పాల్గొని మొక్కులు చెల్లిస్తుంటారు. ఆ రీతిలో ఈ ఏడాది ఆదివారం అర్ధరాత్రి బోధమలై ప్రాంతానికి చెందిన పూజారి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆడమేకను అమ్మవారి గర్భగుడిలో బలిచ్చిన తర్వాత మిగతా మేకలను భక్తులు బలిచ్చారు. ఈ పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో పురుషులందరికీ మేక మాంసంతో విందు ఏర్పాటు చేశారు. ఇందులో చెన్నై, నామక్కల్, సేలం, ధర్మపురి, తదితర జిల్లాలకు చెందిన పురుషులు పాల్గొన్నారు.ఈ జాతరను వందేళ్ళకు పైగా మళయాంపట్టి గ్రామంలో నిర్వహించడం గమనార్హం.



తలపై టెంకాయలు పగులగొడుతున్న పూజారి

తలలపై టెంకాయలు కొట్టించి మొక్కులు

పెరంబూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల తలపై పూజారి టెంకాయలు పగులగొట్టి వారి మొక్కులు నెరవేర్చారు. దిండుగల్ జిల్లా సానార్‌పట్టి యూనియన్ కె.అండిపట్టిలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఆడి పెరుక్కు ఉత్సవాలు ఆదివారం సాయంత్రం విఘ్నేశ్వరుడికి పొంగళ్ల పెట్టే కార్యక్రమం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధానాంశమైన, భక్తులు తలపై టెంకాయలు పగులగొట్టించుకునే కార్యక్రమం జరిగింది. మొదట ఆలయం ముందున్న స్తంభంపై నెయ్యి దీపం వెలిగించారు. అనంతరం మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన పురుషులు, మహిళలు వరుసగా ఆలయం ముందు కూర్చున్నారు. ఆలయ పూజారి చేతిలో కాగడా పట్టుకుని 'గోవింద గోవింద' అని దివ్యనామస్మరణ చేస్తూ ఒక్కో భక్తుని తలపై టెంకాయ పగులగొట్టారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎవరికీ భద్రత లేదు

● అన్బుమణి ఆరోపణ



పార్క్‌లో మొక్కలు నాటుతున్న అన్బుమణి

వేలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పిల్లల నుంచి వృద్ధుల వరకు భద్రత కరువైందని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి ఆరోపించారు. రాణిపేట జిల్లా షోలింగర్, సిప్కాట్ ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్ షోలో అన్బుమణి మాట్లాడుతూ... సిప్కాట్‌లోని క్రోమియం వ్యర్థాలతో భూగర్భ జలాలు కలుషితమై, ఆ ప్రాంతాల ప్రజలు క్యాన్సర్, గుండె జబ్బుల సమస్యలతో బాధపడుతున్నారన్నారు. క్రోమియం తాత్కాలికంగా తొలగించేందుకు రూ.15 కోట్లు కేటాయించినట్లు డీఎంకే ప్రభుత్వం ప్రకటించి, ప్రజలను మోసం చేస్తుందన్నారు. క్రోమియం పూర్తిస్థాయిలో తొలగించాలంటే రూ.700 కోట్ల వరకు ఖర్చవుతోందని, ఈ వ్యవహారంలో గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పును అమలుచేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు డీఎంకేకు ఓట్లు వేసి గతంలో చేసిన తప్పు పునరావృతం కానివ్వరాదని కోరారు. అనంతరం వేలూరులో పర్యటించిన అన్బుమణి, ఓట్టేరి చిల్డ్రన్స్ పార్క్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఎంకే నేత, మాజీ కేంద్ర మంత్రి ఎన్వీ షణ్ముగం, జిల్లా కార్యదర్శులు ఇళవలగన్, జగన్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశన్, కౌన్సిలర్ బాబి కదిరవన్ తదితరులు పాల్గొన్నారు.

సినీ సంగీత రంగానికి శ్రీరాములు సేవలు ప్రశంసనీయం

● అభినందన సభలో వక్తలు



డాక్టర్ బి.శ్రీరాములును సత్కరిస్తున్న సినీ నేపథ్య గాయకులు పి.సుశీల, మనో, డ్రమ్స్ శివమణి తదితరులు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సినీ సంగీత పరిశ్రమకు డాక్టర్ బి.శ్రీరాములు (శ్రీరామ్స్ ఎంటర్‌టైనర్స్)అందించిన సేవలు ప్రశంసనీయమని గానకోకిల, పద్మభూషణ్ పి.సుశీల, ప్రముఖ నేపథ్య గాయకులు మనో, ఎస్పీ చరణ్, ఎస్పీ శైలజ తదితరులు కొనియాడారు. సినీ సంగీత రంగంలో ఐదు దశాబ్దాలుగా గాయకుడిగా, ప్రోగామ్ ఆర్గనైజర్‌గా విశిష్ట సేవలందించిన శ్రీరాములు సేవలను కొనియాడుతూ టి.నగర్‌లోని వాణి మహల్‌లో ఆదివారం సాయంత్రం అభినందన కార్యక్రమం జరిగింది. ప్రముఖ గాయకురాలు పి.సుశీల అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో గాయకులు మనో, ఎస్పీ చరణ్, యుగేంద్రన్, ఎస్పీ శైలజ, మాల్గుడి శుభ, సంజన, అంతర్జాతీయ డ్రమ్మర్ శివమణి, నటుడు శుభలేఖ సుధాకర్, చిన్ని జయంత్, కేపీ మోహన్ తదితరులు హాజరై శ్రీరాములు సేవలను కొనియాడారు.. ఇందులో భాగంగా ఆయనను గజమాల, పూల కిరీటంతో సత్కరించి జ్ఞాపిక బహూకరించి అభినందించారు. గీతాంజలి ఇన్నిసై రాగంగళ్ మ్యూజిక్ బృందం పాత,కొత్త సినీ గీతాలతో ప్రేక్షకులను అలరించారు.

తమిళనాడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సూర్యప్రకాష్



సూర్యప్రకాష్‌చే ప్రమాణస్వీకారం చేయిస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సూర్యప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సూర్యప్రకాష్‌తో ప్రమాణస్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌సీసీ ఇన్‌ఛార్జి సూరజ్ హెగ్డే, మాజీ ఎంపీలు కృష్ణస్వామి, కేవీ తంగబాలు, ఏఐసీసీ కార్యదర్శులు క్రిస్టోఫర్ తిలక్, ఎంపీ రాబర్ట్‌బ్రూస్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు రంజన్‌కుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొని సూర్యప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



మెరీనా బ్లూఫ్లాగ్ జోన్ ప్రారంభించి చిన్నారులను పలకరిస్తున్న ఉదయనిధి



విద్యుత్ దీపాల వెలుగులో మెరీనా బీచ్

మెరీనా తీరానికి నూతన సొబగులు

● సందర్శకులకు ఆకట్టుకునే సదుపాయాలు

ప్యారీస్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అతి పొడవైన రెండో బీచ్‌గా పేరొందిన చెన్నై మెరీనా బీచ్ బ్లూఫ్లాగ్ గుర్తింపు కోసం రూ.7.31 కోట్లతో కొత్త హంగులు సంతరించుకోగా, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి ఆదివారం రాత్రి ప్రారంభించారు. మెరీనా బీచ్‌లో అన్నా ఈత కొలను సమీపంలో ఉన్న 20 ఎకరాల ప్రాంతాన్ని బ్లూఫ్లాగ్ జోన్‌గా మార్చుచేశారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతతో కూడిన సముద్రతీరాలకు ఓ అంతర్జాతీయ సంస్థ బ్లూఫ్లాగ్ హోదా కల్పిస్తుంటుంది. ఆ రీతిలో 33 అర్హతలు కలిగిన మెరీనా బీచ్‌ను బ్లూఫ్లాగ్ జోన్‌గా ఆ సంస్థ ప్రకటించి ధృవీకరణ పత్రం అందజేసింది. మెరీనా బీచ్‌లో సేదతీరేందుకు పలు ప్రాంతాల నుండి వస్తున్న పర్యాటకులకు రక్షణగా 4 వాచ్‌టవర్లు, కూర్చుని సేదతీరేందుకు 40 వెదురు గొడుగులు, 40 కుర్చీలు, 25 చెత్తకుండీలు, దివ్యాంగులు సులువుగా తీరానికి వెళ్ళేందుకు వీల్‌చైర్లు, పిల్లలు ఆడుకునేందుకు 4 పరికరాలు, 10 టెంకాయ చెట్లు, 9 శుభ్రం చేసే యంత్రాలు, ముఖ్యంగా పర్యాటకులను ఆకట్టుకునే ఆర్చీ, జ్ఞానకేంద్రం, విశ్రాంతి గదులు, తల్లులు పసిపిల్లలకు పాలిచ్చే గది ఇలా రూ.7.31 కోట్లతో మెరుగైన వసతులు కల్పించారు. ఆదివారం రాత్రి కొత్త హంగులు సంతరించుకున్న మెరీనా బ్లూఫ్లాగ్ జోన్‌ను ఉపముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించగా, మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్, జీసీసీ మేయర్ ప్రియా తదితరులు పాల్గొన్నారు. కాగా, మెరీనా అందాలను వీక్షించేందుకు సోమవారం ప్రజలు ఆసక్తిగా తరలి వచ్చారు.

ఈసీఆర్‌లో '18 మాల్స్' ఔట్‌లెట్



'18 మాల్స్' ఔట్‌లెట్ ప్రారంభోత్సవంలో జీవా, ప్రియదర్శిని, జాన్

అడయార్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్ట్ రోడ్ (ఈసీఆర్)లోని కానాత్తూరులో 18 మాల్స్ పేరుతో కొత్త ఔట్‌లెట్‌ను నెలకొల్పగా, దాన్ని సినీ హీరో జీవా, నటి ప్రియదర్శిని ప్రారంభించారు. ఆధునిక జీవితాన్ని అమితంగా ఇష్టపడేవారి అభిరుచికి అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. అంతేకాకుండా, చిన్నారులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆహ్లాదకర వాతావరణంలో సరికొత్త అనుభూతి పొందేలా ఈ ఔట్‌లెట్‌ను రూపొందించారు. ఔటింగ్ కోసం వెళ్ళినవారు విశ్రాంతి తీసుకునేందుకు విశ్రాంతి గదులను కూడా నిర్మించారు. ఈ ఔట్‌లెట్ ప్రారంభోత్సవం సందర్భంగా నటుడు జీవా మాట్లాడుతూ, భిన్న వాతావరణంలో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా దీన్ని రూపొందించి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఔట్‌లెట్ ప్రారంభోత్సవంలో అనేక మంది సెలెబ్రిటీలు, ప్రముఖులు పాల్గొన్నారు.



ఆర్ఎల్‌డీ కొత్త కార్యవర్గ సభ్యులు

ఆర్ఎల్‌డీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజారామన్

అడయార్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్‌డీ) తమిళనాడు రాష్ట్ర నూతనాధ్యక్షుడుగా జి.రాజారామన్ ఎంపికయ్యారు. అలాగే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవి పిళ్ళై, రాష్ట్ర కోశాధికారిగా ఏ.తిరునావుక్కరసును ఎన్నుకున్నారు. నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన ఆ పార్టీ సమావేశంలో జాతీయ నేతల సమక్షంలో ఆర్ఎల్‌డీ రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్టు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రిలోక్ త్యాగి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అత్యంత కీలక భూమిక పోషిస్తున్న ఆర్ఎల్‌డీని ఇతర రాష్ట్రాల్లో విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా, తమిళనాడు రాష్ట్ర శాఖకు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



కుమారుడితో కిరణ్ అబ్బవరం దంపతులు

స్వామి సన్నిధిలో 'హను అబ్బవరం'

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్వామి సన్నిధిలో తన కుమారుడికి 'హను అబ్బవరం' అని నామకరణం చేసినట్టు సినీ హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. భార్య నటి రహస్య, కుమారుడితో కలిసి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. హనుమజ్జయంతి రోజున పుట్టినందున కొడుక్కి హను అబ్బవరం అని పేరు పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ', 'కె ర్యాంప్' సినిమాల షూటింగ్ జరుగుతోందన్నారు.



ఆలయం వద్ద సూర్య, జ్యోతిక దంపతులు - కుమారుడు దేవ్, కుమార్తె దియా

తిరుమలలో సూర్య, జ్యోతిక

ప్రముఖ తమిళ హీరో సూర్య, జ్యోతిక దంపతులు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం అర్థరాత్రి తిరుమలకు చేరుకున్న వీరు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తమ ఇద్దరు పిల్లలు దేవ్, దియా పాటు స్వామిని దర్శించుకున్నారు. సూర్య దంపతులను చూసేందుకు, వారితో సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.25 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,339



టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. విజయవాడకు చెందిన క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ ఎండీలు శ్రీనివాస్, చక్రవర్తి రూ.1.05 లక్షల విలువైన బిజినెస్ ఎక్స్‌పీ స్కూటర్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విద్వేషాలను రెచ్చగొట్టేవారి పనిబట్టండి స్వామీ!

● మంత్రి కొలుసు పార్థసారధి

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే- అటువంటి వాటిని అణగదొక్కాలని స్వామిని ప్రార్థించానని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ నీటితో కళకళలాడుతున్నాయన్నారు.



కొలుసు పార్థసారధి

అప్పర్ సీలేరుకు బయలుదేరిన తిరుపతి కబడ్డీ జట్టు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తిరుపతి విద్యుత్ ఉద్యోగుల కబడ్డీ జట్టు

తిరుపతి(ఆటోనగర్), ఆగష్టు4(ఆంధ్రజ్యోతి): అప్పర్‌సీలేరులో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ జట్టు బయలు దేరి వెళ్లినట్లు ఆ జట్టు మేనేజరు స్పోర్ట్స్ కార్యదర్శి లీలారామ్ తెలిపారు. అప్పర్ సీలేరులో రాష్ట్ర స్థాయిలో విద్యుత్ ఉద్యోగులకు కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఉంటాయని చెప్పారు. గత వారం రోజుల నుంచి జట్టు మేనేజరు టి.జయరామ్ అధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చారని కార్యదర్శి చెప్పారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తిరుపతి సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి తమ జట్టు ప్రథమ స్థానం సాధిస్తుందని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.

అన్నప్రసాద నాణ్యత ఎలా ఉంది?

● భక్తులతో మాట్లాడిన ఈవో, అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాల నాణ్యత ఎలా ఉందంటూ టీటీడీ ఈవో శ్యామలరావు అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఆయన అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు. అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న కొందరు భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయలు తెలుసుకున్నారు. వీరూ భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీరించారు. తర్వాత కియోస్క్ మిషన్ ద్వారా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళమిచ్చారు. అన్నప్రసాద భవనంలోని క్యూలైన్లు, పరిశుభ్రత, ముడి సరుకుల నిల్వ గది తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్యాస్ ప్లాంట్‌నూ పరిశీలించారు. ఈకార్యక్రమంలో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



భక్తుల అభిప్రాయం తెలుసుకుంటున్న ఈవో, అదనపు ఈవో

'అమరరాజా'లో హరియాణా మాజీ డిప్యూటీ సీఎం

రేణిగుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలోని అమర రాజా పరిశ్రమను హరియాణా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌటాల సోమవారం సందర్శించారు. పరిశ్రమలోని పచ్చదనం అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అమరరాజా గ్రూప్ పరిశ్రమలు దేశంలో వ్యాపార మేధస్సు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రతీక అని కొనియాడారు. పరిశ్రమ లోపల పర్యావరణం, పరిరక్షణ, నాణ్యత ప్రమాణాలు, సమాజ అభివృద్ధి వంటి అంశాలలో అమర గ్రూప్స్ చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహులునాయుడు పాల్గొన్నారు.



అమర్ రాజా పరిశ్రమలో మొక్కలు నాటుతున్న దుష్యంత్ సింగ్ చౌటాల

భూసమస్యలు బోలెడు

● పరిష్కరించాలంటూ బాధితుల వేడుకోలు

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'మా భూములు కబ్జా అయ్యాయి. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా పరిష్కారం చూపండి' అంటూ ఎందరో బాధితులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు రాగా, అందులో 162 భూ సమస్యలకు సంబంధించినవే. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...



వినతిపత్రాలను స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

వితంతు పింఛను ఇచ్చి ఆదుకోండి



'నా భర్త గ్రానైట్ వేసే కూలీపనికి వెళ్లేవాడు. పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛను ఇప్పించి ఆదుకోండి' అంటూ గీత అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.



మా భూములు కబ్జా చేశారు.. పరిరక్షించండి

మాభూమిని గెరటయ్య అనే వ్యక్తి కబ్జా చేశాడంటూ బాలాయపల్లి మండలం వాక్యం గ్రామానికి చెందిన విజయమ్మ, మరికొందరు కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. 'గ్రామంలోని 8 ఎకరాల్లో 30 ఏళ్లుగా వర్షాధారంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఐదేళ్ల కిందట నిమ్మ మొక్కలు నాటాం. గెరటయ్య దౌర్జన్యంగా ప్రవేశించి నిమ్మ చెట్లను తొలగించారని తిరిగి ఫెన్సింగ్ వేస్తే దానిని దౌర్జన్యంగా తొలగించాడని బాధితులు అధికారులెదుట వాపోయారు. ఇలా పంటలపై దౌర్జన్యం చేస్తుండటంతో సదరు భూమిపై కబ్జాదారులుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మా ఇంటి స్థలం కబ్జాచేశారు.

'మాది నిరుపేద కుటుంబం. నా వికలత్వ పింఛనుతో తల్లిదండ్రులను పోషించుకుంటున్నా. ఆరు సెంట్ల ఇంటి స్థలాన్ని చెల్లయ్య, తిరుపాలు తదితరులు కబ్జా చేశారు. నేను వికలాంగుడిని కావడంతో నాపై దౌర్జన్యం చేసి దూషిస్తున్నారు' అంటూ సత్యవేడుకు చెందిన సౌందరరాజ్ ఆవేదన చెందారు. కబ్జాదారులు ఆక్రమించిన ఇంటి స్థలాన్ని తిరిగి ఇప్పించాలని అధికారుల ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు.



మౌలిక వసతులు కల్పించండి

మాది పుత్తూరు మండలం నంది మంగళం పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ. మా దళిత వాడలో మౌలిక వసతులు కల్పించండి.. అంటూ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కోనేటిపాళెంలో దళితవాడకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ఇంటి స్థలాలు కల్పించాలని కోరారు. లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు.





22 ఏ నుంచి మా భూములకు విముక్తి కలిగించండి

తిరుపతి రూరల్ మండలం దామినేడులోని 22/ఏ నుంచి తమ భూములకు విముక్తి కలిగించాలని దామినేడు ప్లాట్ల సంక్షేమ సంఘం నేతలు అధికారులను కోరారు. నిషేధిత జాబితా నుంచి తొలిగించి తమకు న్యాయం చేయాలన్నారు.

పాఠశాలను తొలగించవద్దు

1958వ సంవత్సరంలో మా గ్రామంలో రాజానగరం (పిచ్చాటూరు మండలం)లో ఎంపీపీ స్కూల్ ఏర్పాటు చేశారు. 1986లో ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 3, 4, 5 తరగతులను వేలూరు గ్రామానికి తరలించారు. తిరిగి మా పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ చేసినట్లయితే ఉన్నత పాఠశాల మనుగడ సాధిస్తుంది.



ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో బాధ్యతగా పనిచేయండి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖపై ఎంతో నమ్మకంతో జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి విచ్చేసి తమ బాధలను, సమస్యలను ఆవేదన రూపంలో చెప్పుకోవడానికి వస్తున్నారు. అటువంటి వారి సమస్యలను బాధ్యతగా పట్టించుకుని పరిష్కరించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. ఆయా పోలీసు స్టేషన్లలో అధికారులు స్పందించని పక్షంలో అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. తిరుపతిలో సోమవారం ఎస్పీ నేతృత్వంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 102 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను ఎస్పీ ఎదుట ఏకరువు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, సీఐలు సాధిక్ ఆలీ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ

సంస్కృత వర్సిటీలో వైభవంగా భాషోత్సవం

● శోభాయాత్రలో పాల్గొన్న వివిధప్రాంతాల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భాషోత్సవం పేరుతో రెండు రోజులపాటు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ సూచకగా యూనివర్సిటీలోని స్వామి నారాయణ అక్షర పురుషోత్తమ మండపం నుంచి సభా ప్రాంగణం దాకా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు భవనంలో నిర్వహించిన ప్రారంభ సభలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చాలా ప్రాధాన్యత గల అంశంపై ఉత్కల పీఠం జాతీయ సదస్సు నిర్వహించడం శుభ సూచకమన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. న్యూఢిల్లీకి చెందిన స్వామి నారాయణ సంప్రదాయ అక్షరధామ్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్ స్వామి మాట్లాడుతూ.. పురుషోత్తమ భాష్యం అనేది ప్రస్థాన త్రయానికి సంబంధించినది అన్నారు. అక్షర పురుషోత్తమ బాష్యం రాయడానికి మునుపు ఇందులోని గొప్పదనాన్ని తెలుసుకోవాలని కోరారు. యూజీసీ వైస్ ఛైర్మన్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం సామాజికంగా ఎంత అవసరమో ఆలోచించాలన్నారు. దీనిని సామాజిక ఔన్నత్యానికి అవసరమైన విధంగా రూపొందించాలని సూచించారు. ఐసీపీఆర్ సభ్యుడు సచ్చిదానంద మిశ్రా మాట్లాడుతూ.. సంస్కృత భాషలోనే కాకుండా, ఇతర భాషల్లోనూ ప్రస్థాన త్రయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయం వల్ల మానవ జీవన విధానం గొప్ప స్థితికి చేరుతుందని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం, క్రియాన్వయనం ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా ఎలా రూపొందించాలనే విషయంపై అవగాహన అవసరమన్నారు. గుజరాత్‌లోని సోమనాథ సంస్కృత వర్సిటీ వీసీ సుఖాంత్‌కుమార్ సేనాపతి మాట్లాడుతూ.. వేదాంతాది శాస్త్రాల్లో ప్రస్థాన త్రయానికి ఔన్నత్యం ఉందనీ, మంచి ఫలితాలు కూడా ఉన్నాయన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివ మూర్తి మాట్లాడుతూ.. వేద విజ్ఞానంలో ప్రస్థాన త్రయం గొప్ప ప్రాముఖ్యత కలదన్నారు. ఇందులోని విశేషాలను ఈ తరానికి అవసరమైన విధంగా విశ్లేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పండా, సలహాదారు ప్రొఫెసర్ శంకర నారాయణ, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

సీపీఐ జిల్లా ముగింపు సభలో మాజీ ఎమ్మెల్సీ విల్సన్

సూళ్లూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సూళ్లూరుపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ జిల్లా రెండో మహాసభల ముగింపు సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ సీపీఐ పుట్టినప్పటి నుంచి కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటు చేస్తోందన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలయ్యిందని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకే మోదీ దేశాన్ని పాలిస్తున్నారని, ప్రజాస్వామ్యం బద్ధంగా ఏదీ జరగడం లేదన్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం నినాదంతో మత కలహాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ, అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసి పేదల కడుపుకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రజాస్వామ్యం బద్ధంగా వ్యహరించకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నేడు ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో కీలక భూమిక కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. అంతకుముందు సీపీఐ జిల్లా నాయకుడు మోదుగుల పార్థసారది పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, చిన్నం పెంచలయ్య, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, శివారెడ్డి, జయలక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

టీటీడీ ఆలయాలకు 'సౌభాగ్యం'

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరిగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా టీటీడీకి చెందిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని 51 ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సౌభాగ్యవంతులకు గాజులు, పద్మావతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తక ప్రసాదాలు అందించనున్నారు. ఈ సందర్భంగా సుమంగళి ద్రవ్యాలను పంపిణీ చేసేందుకు ఓ అజ్ఞాత భక్తులు విరాళంగా అందించిన 8 లక్షల గాజులు, 1.40 లక్షల చొప్పున కంకణాలు, పసుపుదారాలు, కుంకుమ ప్యాకెట్లు, పుస్తకాలు ఆయా ఆలయాలకు పంపారు.

అమ్మవారికి కానుకగా 5వేల డజన్ల గాజులు

తిరుచానూరు, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 8న జరగనున్న వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని స్థానికులైన సివిల్ ఇంజనీర్ షర్మిళ షణ్ముగం దంపతులు 5వేల డజన్ల గాజులు, పదివేల కంకణాలు, పదివేల పసుపు కుంకుమ ప్యాకెట్లను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయడు పాల్గొన్నారు.



ఆలయాధికారులకు గాజులు, పసుపు కుంకుమ అందిస్తున్న దాత షణ్ముగం

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ప్రత్యేక నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఇతడితో పాటు మరో 18 మంది మందుబాబులకు రూ.10 వేల వంతున రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు

తిరుమల ఉద్యోగుల క్వార్టర్స్‌లో చోరీ

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.20 వేల నగదు, 12 గ్రాముల బంగారు బ్రాస్‌లైట్‌ను అపహరించారు. డీ టైప్ క్వార్టర్స్‌లోని మహేంద్ర అనే టీ వ్యాపారి ఇంట్లో ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపారు. కాగా స్థానికులు నివాసించే బాలాజీనగర్‌లో 30 మంది పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్న సమయంలోనే ఈ చోరీ జరగడం గమనార్హం.



చోరీ జరిగిన ఇంటి పరిశీలిస్తున్న పోలీసులు

5 కిలోల గంజాయి స్వాధీనం - ఒకరి అరెస్టు

ఓజిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారికి సమీపంలో సోమవారం 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, బెంగళూరుకు చెందిన పటాన్ షారూక్‌ను ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసేందుకు వెళుతుండగా పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి బ్యాగ్‌తో ఓ అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా బెంగళూరుకు చెందిన షారూక్‌గా తెలిసింది. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 5 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.